క్లుప్తంగా

హెల్మెట్ ధారణపై నేడు అవగాహన ర్యాలీ


రెండో అదనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: రోడ్డు భద్రత, హెల్మెట్ ధారణపై న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలాపురంలో గురువారం ఉదయం 8.30 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్ వి.నరేష్ తెలిపారు. కేంద్ర మోటారు వాహనాల చట్టం-167 ప్రకారం రహదారి భద్రతలో భాగంగా ప్రతి ద్విచక్ర వాహన దారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి కారు వాహన చోదకుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని ఈ రెండు అంశాలపై అవగాహన కల్పించనున్నామని న్యాయమూర్తి వివరించారు. ర్యాలీ స్థానిక కోర్టుల ఆవరణ నుంచి గడియారం స్తంభం వరకూ సాగుతుందన్నారు. న్యాయ స్థానాల ఉద్యోగులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు ర్యాలీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం


శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లవరం: అమెరికాకు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గోడిలంక గ్రామంలో ఉపసర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు అధ్యక్షతన బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 278 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 111 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. 14 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని, వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వేగిరాజు శ్రీను, రాంబాబు రాజు, దాట్ల గోపిరాజు, దత్తుడు రాజు, నాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్


కోలా శ్రీమన్నారాయణ

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంకకు చెందిన కోలా శ్రీమన్నారాయణకు విశాఖ గీతం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆయన ప్రస్తుతం అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం ప్రతిక్షేపణలపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ, కోలా బాబ్జి తదితరులు అభినందించారు.

చిట్టిబాబుకు ఘన నివాళి


చిట్టిబాబుకు నివాళులర్పిస్తున్న దండోరా నాయకులు

అమలాపురం రూరల్: అంబాజీపేట మండలం ఇరుసుమండ మాజీ పంచాయతీ మెంబర్, దండోరా నాయకుడు మోకాటి చిట్టిబాబు మృతికి జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మోకాటి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. బుధవారం ఆయన అధ్యక్షతన జరిగిన సంతాప సభలో చిట్టిబాబు చిత్రపటానికి సొసైటీ సభ్యులు, దండోరా నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రాయి రాంబాబు, మాజీ ఎంపీపీ పొలమూరి నీనా పద్మజా ధర్మపాల్, ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ పొలమూరి సత్యనారాయణ, జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మడికి శ్రీరాములు, కాప నాగభూషణం, మోకాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రావులపాలెం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే అన్ని ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రావులపాడు, ఊబలంక, కొమరాజులంక, రావులపాలెంలోని ఆదిలక్ష్మినగర్ ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరి చేలకు వంతెన గండం

- శిథిల స్థితిలో ఇంజరం వంతెన
- తాత్కాలిక తూరల ఏర్పాటుతో పేరుకుపోతున్న చెత్త చెదారాలు
- శివారు ప్రాంతాలకు అందని సాగు నీరు


శిథిల స్థితికి చేరిన ఇంజరం వంతెన


చెత్త చెదారాలతో మూసుకుపోతున్న కల్వర్టు తూరలు

తాళ్లరేవు: మండలంలోని వరి చేలకు వంతెన గండం పట్టుకుంది. యానాం-ద్రాక్షారామ రహదారిలో ఇంజరం వద్ద గల వంతెన శిథిలస్థితికి చేరుకోవడంతో రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా కల్వర్టు నిర్మించారు. సాగునీరు వెళ్లేందుకు భారీ తూరలు ఏర్పాటుచేశారు. అయితే తూరల వద్ద చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో సాగునీరు దిగువకు వెళ్లడం లేదు. ఫలితంగా శివారు ప్రాంతాల పొలాలకు సాగు నీరందక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వంతెన పునర్‌నిర్మాణం నేటికీ జరక్కపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

రెండు వేల ఎకరాలకు నష్టం

మండలానికి సాగు నీరందించే పిల్లంక ప్రధాన కాలువపై 1939లో బ్రిటీష్ వారి కాలంలో వంతెన నిర్మించారు. అయితే ఐదేళ్ల క్రితం ఈ వంతెన కుంగిపోయి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రభుత్వం తాత్కాలికంగా వాహనాల రాకపోకలతో పాటు సాగు నీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా తూరలు వేసి కల్వర్టు నిర్మించారు. అయితే సాగునీటి కోసం వేసిన తూరల వద్ద చెత్త చెదారాలు నిలిచిపోతుండడంతో నీరు దిగువకు వెళ్లడం లేదు. దీంతో ప్రధానంగా తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ ప్రాంతాల్లోని శివారు భూములకు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. నీటి ఎద్దడి కారణంగా వరి చేలు ఎండిపోతున్నాయని శివారు ప్రాంత రైతులు వాపోతున్నారు. అసలే నీరు రాక ఇబ్బందులు పడుతుంటే మండల పరిధిలో ఉన్న రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థలు నీటిని తరలించుకుపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు నీరందక అష్టకష్టాలు



ఇంజరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన తూరలు పూడుకుపోయి సాగు నీరు రాక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో సాగునీటి ఎద్దడి తలెత్తడంతో తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాం. ఇంజరం వంతెన వద్ద తాత్కాలిక నిర్మాణాలను తొలగించి వంతెన నిర్మాణం చేపట్టాలి. కాలువల్లో పూడికలు తొలగించి సాగునీరు పూర్తిస్థాయిలో వచ్చేలా చేయాలి.

– మేడిశెట్టి కుమార్, రైతు

కౌలు రైతులు నష్టపోతున్నారు



సాగునీటి సమస్య కారణంగా మండలంలోని కౌలు రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. ఖరీఫ్, రబీ పంటల్లో సైతం శివారు ప్రాంత భూములకు నీరందక సుమారు 500 నుంచి 600 ఎకరాల వరి పంట ఎండిపోతుంది. తక్షణమే వంతెన నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలి.

– వల్లు రాజబాబు, జిల్లా కార్యదర్శి, ఏపీ కౌలు రైతుల సంఘం

అన్నదాతలకు అదనపు భారం

పంటను రక్షించుకోవడానికి డీజిల్ ఇంజిన్లు పెట్టుకుని నీటిని తోడుకోవాల్సి వస్తుందని వంతెన సమీపంలోని రైతులు చెబుతున్నారు. శివారు ప్రాంత భూములకైతే ఇంజిన్లకు కూడా నీరు అందడం లేదంటున్నారు. ఇప్పటికే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ఇతర ఖర్చులు పెరిగిపోయి ఇబ్బందులు పడుతుంటే సాగు నీటిని తోడుకునేందుకు ఎకరాకు మరో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ అదనపు భారం పడుతుందని రైతులు చెబుతున్నారు. తమ సమస్యలన్నింటికీ ప్రధాన కారణమైన ఇంజరం వంతెనను తక్షణమే నిర్మించి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై రహదారులు భవనాల శాఖ జేఈ వి.లక్ష్మీప్రసన్నను వివరణ కోరగా ఈ వంతెన నిర్మాణానికి సంబంధించి రూ.2.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం చేపడతామని తెలిపారు.

సమాజ అభివృద్ధికి క్లబ్ సేవలు అభినందనీయం


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న క్లబ్ నూతన అధ్యక్షుడు వేణుగోపాలరావు

అమలాపురం రూరల్: సమాజ అభివృద్ధికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. అమలాపురం సర్ సీవీ రామన్ పాఠశాల ప్రాంగణంలో అమలాపురం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం చేత కోఆర్డినేటర్ డీవీఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు మాట్లాడుతూ తన పదవీ కాలంలో క్లబ్ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వేలూరి సూర్యనారాయణ, మాజీ గవర్నర్ డాక్టర్ పీఎస్ శర్మ, పి.శ్రీనివాసరెడ్డి, మద్దెల వెంకటేశ్వరరావు, పొత్తూరి వెంకటపతిరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

యానాం: పట్టణంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. సంఘ అధ్యక్షుడిగా ఏలూరి శివప్రసాదరావు, సెక్రటరీగా కె.ఆనంద్, కోశాధికారిగా అత్తిలి రాజు, అడ్వైజర్‌గా బొద్దు ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా పి.భైరవ స్వామి ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు యానాం ప్రాంతీయ పరిపాలనాధికారిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

హాస్టల్ చెంత చెత్తాచెదారాల తొలగింపు


గొల్లవిల్లి హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో బుధవారం చెత్తాచెదారాల తొలగింపు పనులు చేపట్టారు. అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ పొలమూరి మోహన్ బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యను కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ డీఎల్‌పీవో బొజ్జిబాబును బాలికల హాస్టల్ పరిశీలనకు వెళ్లి పరిస్థితి మెరుగుపరచాలని ఆదేశించారు. దీంతో హాస్టల్ పరిసరాలలో ఉన్న చెత్తాచెదారాలను జేసీబీ సాయంతో తొలగించడంతో పాటు హాస్టల్ పరిసర ప్రాంతాలను అధికారులు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నాడ చిన్ని, సుంకర బుజ్జి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, మద్దింశెట్టి సీతారామస్వామి, గనిశెట్టి కిషోర్, నాగిరెడ్డి నాగబాబు, గనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న పవన్‌కుమార్


ఉప్పలగుప్తంలో ఏకలవ్యుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం టౌన్: స్థానిక 27వ వార్డులో ఎరుకుల సామాజిక వర్గీయులు ఏకలవ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి సెలవు ప్రకటించాలని ఎరుకుల సామాజిక పెద్దలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బండి తేజస్విని, శీలం ఏడుకొండలు, సజ్జా సూరిబాబు, మాణిక్యం, సోమయ్య, శీలం ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల కేంద్రం ఉప్పలగుప్తంలో ఏకలవ్య జయంతిని ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోహర జోషి, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలసుబ్రహ్మణ్యం, సంఘ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, చెంచుకోట సత్యనారాయణ, గాడ రమేష్, మోగలి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీవీ రమణయ్య జయంతి


భీమనపల్లిలో బీవీ రమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ రాజ్‌కుమార్


బీవీ రమణయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: అల్లవరం మాజీ శాసనసభ్యుడు బీవీ రమణయ్య జయంతిని మండలంలోని భీమనపల్లి, చల్లపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. భీమనపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి, చల్లపల్లిలో దళిత ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబుల ఆధ్వర్యంలో బీవీ రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, వార్డెన్ ప్రవీణ్‌కుమార్, పరమట వెంకటేశ్వరరావు, కొల్లు ప్రసాద్‌రావు, కాట్రు ఆనందరావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ శాసన సభ్యుడు, రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీ రమణయ్య 89వ జయంతిని రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రుషి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బీవీ రమణ్య బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు చేసిన పోరాటాలు చేసిన మహనీయుడన్నారు. ఈ సందర్భంగా బీవీ రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, బళ్ల సత్యనారాయణ, దడాల రామకృష్ణ, చీకురుమిల్లి చిరంజీవి, మోకా బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

ఊడిమూడిలంక వంతెన పనుల పరిశీలన


ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ రవీంద్ర


పి.గన్నవరం: వశిష్ట నదీపాయపై రూ.49.5 కోట్లతో నిర్మిస్తున్న ఊడిమూడిలంక వంతెన నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఎస్ఈ రవీంద్ర బుధవారం పరిశీలించారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గతేడాది వంతెన పనులను ప్రారంభించిన విషయం విదితమే. శరవేగంగా జరుగుతున్న ఈ వంతెన పనులపై ఎస్ఈ రవీంద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. 3, 4వ నెంబర్ల పిల్లర్లకు వెల్ ఫౌండేషన్‌ను పరిశీలించి బాటమ్ ప్లగ్గింగ్‌కు ఆయన అనుమతి ఇచ్చారు. వరదలు వచ్చేలోగా ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను ఎస్ఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబు, ఏఈఈలు కొండలరావు, సత్యనారాయణ, కాంట్రాక్టర్ పీపీ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో తాళ్లరేవు కేశవస్వామి


యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి


బండారులంకలో ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి


గాజుల అలంకరణలో నల్లమిల్లి సత్తెమ్మ తల్లి

తాళ్లరేవు: పవిత్ర తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రధానంగా తాళ్లరేవు కేశవపురంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి ఆలయం, ప్రధాన రహదారిలోని భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అలాగే జార్జిపేట, పి.మల్లవరం, పిల్లంక, జి.వేమవరం, కోరంగి తదితర గ్రామాల్లోని విష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యానాం: భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లలిత మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు, అర్చకులు పెద్దింటి రఘురామ వినోద్ స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి గంగ, సింధూర, తమలపత్ర పూజ చేశారు.

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక నారాయణరావుపేటలో వేంచేసియున్న సీతారామస్వామి ఆలయంలో బుధవారం పవిత్ర తొలి ఏకాదశి సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బండారులంకలో వేంచేసియున్న భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామివారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంగేటి దోలామణి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని నల్లమిల్లి గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత సత్తెమ్మ తల్లి అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడం మాసం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం గ్రామంలోని ఆడపడుచులు, భక్తులు గాజులతో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ముంపు నీరు దిగే మార్గం లేదు


ఇసుకపూడిలో నీట మునిగిన నారు మడులు

అంబాజీపేట: పంట పొలాల్లో వర్షపు నీరుతో పాటు మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నారుమడులు, వరి పంటలు నీట మునిగిపోతున్నాయని ఇసుకపూడి బందకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చేలల్లోని మురుకు నీరు బయటకు వెళ్లే మార్గంలో బోదెలతో పాటు తూరలను ఆక్రమణదారులు అడ్డుకట్ట వేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి పంట పొలాల్లోని నీరంతా ఈ చేలల్లోకి చేరి నీట మునిగిపోతున్నాయి. గత ఏడాది నీట మునిగిపోవడంతో సాగు చేపట్టలేదని రైతులు వాపోయారు. గతంలో ఉన్న తూర మూసివేయడంతో చేలల్లో నీరు బయటకు వెళ్లడం లేదని రైతులు వాపోయారు. అలాగే పంట కాలువలో ఉన్న చెత్తా చెదారం, తూడును తొలగిస్తే మురుగు నీరు వెళ్లేందుకు మార్గం ఉంటుందని రైతులు చెబుతున్నారు. వేసవి కాలంలో నీరు కావాలంటే దొరకదని, వర్షాకాలంలో మాత్రం నీట మునిగిపోతుందని రైతులు చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్నత పాఠశాల రోడ్డు


వర్షపు నీరు నిలిచిపోవడంతో అధ్వానంగా మారిన కదలి రోడ్డు

రాజోలు: కదలి గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. కదలి సెంటర్ నుంచి చెన్నడం, పొన్నమండ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఈ రహదారిలో ఎక్కువగా ప్రయాణం చేస్తారు. కదలి ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కదలి కపోతేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే భక్తులు రోడ్డు పాడైపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గుంతలు ఏర్పడడంతో కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌లను సరిచేసి వర్షం నీరు దిగేందుకు మార్గాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన చేపట్టి ప్రయాణికులు, విద్యార్థులు, భక్తుల ఇక్కట్లు తొలగించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి రొక్కాల సందీప్, రాజాబాబు, ప్రకాష్, అనిల్ కోరుతున్నారు.

పోషక లోపమే దిగుబడికి అడ్డంకి


కేశనపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలికిపురం: పోషక లోపమే దిగుబడికి అడ్డంకి అని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ఎలియాజార్ అన్నారు. బుధవారం కేశనపల్లిలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఏక పంటల విధానం, పోషకాల లభ్యత, చీడ పీడలు, సక్రమంగా లేని నీటి యాజమాన్యం, కలుపు సమస్యలపై ఎలియాజార్, కొబ్బరి రైతులతో చర్చించారు. ఈ మేరు ఆయా అంశాలపై సమగ్ర సమాచారం వారికి అందించి, తగిన సలహాలు, సూచనలు అధికారుల నుంచి పొందాలని కోరారు. అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, రైతులు యడ్ల విష్ణుమూర్తి, గెద్దం వసంత కుమార్, అడబాల మూలాస్వామి, నల్లి నాగేశ్వరరావు, రావూరి ఏసు, యడ్ల వెంకట రమణ, వ్యవసాయ సిబ్బంది మట్టా శ్రీనివాసరావు, మురళి, కిరణ్, నాగబాబు, సురేష్, రవికాంత్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

మలికిపురం: రాజోలు, మలికిపురం మండలాల్లో అనారోగ్యం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నలుగురికి వసుధ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని చెక్‌ల రూపేణా బుధవారం వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా మలికిపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందించారు. పొన్నమండకు చెందిన చిన్నారి కుసుమ సత్యశ్రీకి రూ.పదివేలు, కొల్లాటి శ్రీను(డయాలసిస్) అడవిపాలేనికి చెందిన డయాలసిస్ వ్యాధిగ్రస్తుడు కొల్లాటి శ్రీనుకి రూ.10 వేలు, ఇరుసుమండకు చెందిన గుండె ఆపరేషన్ చేయించుకున్న బండారు వెంకటేశ్వర్లుకు రూ.పదివేలు, గుడిమెళ్లంకకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నల్లి లలితకు రూ.పదివేలు చొప్పున మొత్తం రూ.40 వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు, సఖినేటిపల్లి సర్పంచ్ జి.చిట్టిబాబు, అటారం మాస్టారు, కాజా నరసింహారావు, గ్రామాల్లోని పెద్దలు పాల్గొని వెంకటరామరాజు చేస్తున్న సేవలను కొనియాడారు.